VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఆళ్లగడ్డ
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 20-03-2024 సంపుటి : 06 సంచిక : 190 పేజీలు : 8 వెల : రూ 3-00

## బీజేపీ విస్తరణకు ఆయన ఎంతో కృషి చేసారు: ప్రధాని మోదీ భావోద్వేగం



సేలం: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని 'నరేంద్ర మోదీ' దక్షిణ భారతదేశంపై దృష్టి సారించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమికి తమిళనాడు తన మద్దతును గట్టిగా ప్రకటించిందని మోదీ మంగళవారం ప్రకటించారు.తమిళనాడులోని సేలంలో జరిగిన ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఏప్రిల్ 19న ప్రతి ఒక్క ఓటు బీజేపీ-ఎన్‌డీఏకు వేయాలని తమిళనాడు నిర్ణయించింది. తమిళనాడులో బీజేపీకి ప్రజలు ఇస్తున్న మద్దతు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ మద్దతు ప్రతిపక్ష పార్టీలకు నిద్రలేకుండా చేస్తున్నాయని అన్నారు.రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షులు దివంగత కేఎన్ లక్ష్మణన్.. రాష్ట్రంలో బీజేపీ విస్తరణకు ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నప్పుడు ప్రధాని ఉద్వేగానికి లోనయ్యారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆడిటర్ 'వీ. రమేష్'ను గుర్తు చేసుకున్నారు. పీఎంకేతో సీట్ల పంపకాల ఒప్పందం తరువాత ఎన్‌డీఏకు కొత్త శక్తి వచ్చిందని మోదీ అన్నారు.ఏప్రిల్ 19న జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం తమిళనాడులోని డాక్టర్ ఎస్ రామదాస్ నేతృత్వంలోని పీఎంకేతో అంతకుముందు రోజు బీజేపీ సీట్ల భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ప్రాంతీయ పార్టీకి 10 కేటాయించడం జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే అన్నామలై, పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్‌లు తైలాపురంలోని ఆయన నివాసంలో ఒప్పందంపై సంతకాలు

## సీఎం జగన్ బస్సు యాత్ర షెడ్యూల్ ఖరారు

మార్చి 27 నుంచి సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర
ఇడుపులపాయ నుంచి బస్సు యాత్ర ప్రారంభం
తొలుత ఇడుపుల పాయ వైఎస్సార్ ఘాట్ వద్ద సీఎం జగన్ నివాళులు
ఉదయం కార్యకర్తలతో ఇంటరాక్షన్, సాయంత్రం బహిరంగ సభలు
27న ప్రొద్దుటూరులో వైఎస్ జగన్ తొలి బహిరంగ సభ
28న నంద్యాలలో సీఎం జగన్ బస్సు యాత్ర, సాయంత్రం సభ



తాడేపల్లి: ఈ నెల 27న ఇడుపులపాయ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ప్రారంభం కానుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. రూట్ మ్యాప్‌ను వైఎస్సార్‌సీపీ నేతలు మీడియా సమావేశంలో వివరించారు. సిద్ధం సభలు జరిగిన ప్రాంతాలు కాకుండా, మిగిలిన ప్రాంతాల్లో బస్సు యాత్ర జరుగుతుందన్నారు. సిద్ధం సభలో లక్షలాది మంది పాల్గొన్నారన్నారు. మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేశామని, అదే విషయాన్ని ప్రజలకు చెప్పి ఓటు అడుగుతామని సజ్జల పేర్కొన్నారు."నాలుగు సిద్ధం సభలతో క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేశాం. ఈ ఐదేళ్లలో 20 ఏళ్ల అభివృద్ధిని చేసి చూపించాం. సిద్ధం సభలు జాతీయ స్థాయిలో పేరు పొందాయి. దీనికి కొనసాగింపుగా 'మేమంతా సిద్ధం' పేరుతో జగన్ బస్సు యాత్ర చేస్తారు. ఇడుపులపాయ నుండి ఈ బస్సుయాత్ర మొదలు పెడతారు. రాష్ట్రమంతటా ఉన్న కోట్లాది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కలుస్తారు. సిద్ధం సభలు జరిగిన జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలో బస్సుయాత్ర సాగుతుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు యాత్ర జరుగుతుంది. తరువాత మిగిలిన నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు' అని సజ్జల పేర్కొన్నారు.సీఎంగా ప్రజల సంక్షేమం కోసం వైఎస్ జగన్ కష్టపడ్డారు. ప్రొద్దుటూరులో తొలి మేమంతా సిద్ధం సభ జరుగుతుంది. సీఎం జగన్ సభలకు ఊర్లకు ఊర్లే కదిలి వస్తాయి. అందరూ ఆశ్చర్యపడేలా సభలు ఉంటాయి. ఉదయం కొన్ని వర్గాలతో ఇంటరాక్షన్స్ ఉంటుంది. వారినుండి సలహాలు సూచనలు తీసుకుంటారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో కనీసం రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర ఉండేలా చూస్తున్నాం . తొలిరోజు ప్రొద్దుటూరులో సభ ఉంటుంది. రెండవ రోజు నంద్యాల, లేదా ఆళ్లగడ్డలో ఇంటరాక్షన్. నంద్యాలలో బహిరంగ సభ. 29న ఎమ్మిగనూరులో సభ ఉంటుందని సజ్జల వెల్లడించారు.

## సీఏఏపై స్టే కోరుతూ సుప్రీంలో పిటీషన్లు..

### ఏప్రిల్ 9కి విచారణ వాయిదా



న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టంపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటీషన్లపై ఇవాళ సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. మూడు వారాల్లోగా పిటీషన్లకు వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. ప్రస్తుతం సీఏఏ అమలుపై స్టే విధించేందుకు కోర్టు నిరాకరించింది. అయితే ఈ కేసులో మళ్లీ ఏప్రిల్ 9వ తేదీన విచారణ ఉంటుందని సుప్రీం తెలిపింది. సీఏఏపై ఆందోళన వ్యక్తం చేస్తూ సుప్రీంలో 236 పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఇటీవల ఆ చట్టానికి చెందిన రూల్స్‌ను నోటిఫై చేస్తూ ఇచ్చిన ఆదేశాలను కూడా ఆయా పిటీషన్లలో సవాల్ చేశారు. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. సీఏఏను సవాల్ చేస్తూ ఇండియన్ ముస్లిం లీగ్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తున్నారు. 1995 నాటి పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 2ను సవరించారు. దాని ప్రకారమే ఆఫ్ఘన్, బంగ్లా, పాక్‌లో ఉన్న హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సి, క్రైస్తవ మైనార్టీలకు పౌరసత్వాన్ని ఇవ్వనున్నారు. పొరుగు దేశాల్లో మతపరమైనవేధింపులకు గురవుతున్న వారిని రక్షించాలన్న ఉద్దేశంతో ఆ సవరణ రూపొందించారు.

## ఉద్యోగాలు కట్..

### ఎన్నికల కోడ్ అమలుపై అధికారులకు సీఎస్ కీలక ఆదేశాలు


అమరావతి: దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా పక్కాగా అమలుచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.తాజాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి కీలక ఆదేశాలు ఇచ్చారు. ఏపీ సీఈవో మీనాతో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సమావేశం నిర్వహించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్ని శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు సీఎస్. ముఖ్యంగా ప్రభుత్వ వెబ్ సైట్లు అన్నింటిలో ప్రజా ప్రతినిధులకు సంబంధించిన ఫొటోలు, ఆడియో, వీడియోలు వంటివి వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధులకు సంబంధించిన ఫొటోలను, ఫ్లెక్సీలను తొలగించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులపై గల రాజకీయపరమైన ప్రకటనలన్నీ తొలగించాలని సీఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై ఏశాఖ పైనైనా ఫిర్యాదులు వస్తే సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ జవహర్ రెడ్డి కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే అలాంటి వారిపై విచారణ జరిపి ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యల తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అధికారులు అందరూ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యదర్శి స్థాయి అధికారులు ఎన్నికల పరిశీలకులుగా వెళ్ళనున్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పూర్తి స్పష్టత ఉండేలా మార్గదర్శకాలను పూర్తిగా చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి సీఈవో ఇచ్చే ప్రత్యేక ఫార్మాట్‌లో నివేదిక ఇవ్వాలని అన్ని శాఖల కార్యదర్శులను జవహర్ రెడ్డి ఆదేశించారు.ఎన్నికల షెడ్యూల్ వెలువడి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కొత్త పథకాలు ప్రకటించడానికి వీలులేదని సీఈవో మీనా స్పష్టం చేశారు. బడ్జెట్ ప్రావిజన్ ఉన్నప్పటికీ నూతన ప్రాజెక్టులు, పథకాలు, రాయితీలు, గ్రాంట్లు మంజూరు, హామీలు, శంఖుస్థాపనలు పూర్తి నిషేధమని తెలిపారు. వర్క్ ఆర్డర్ ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పనులు మొదలు కాని పనులు చేపట్టకూడదని తెలిపారు. పనులు పూర్తయిన వాటికి నిధులు విడుదలలో ఎలాంటి నిషేధం లేదని స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీకి ఎలాంటి అభ్యంతరాలు లేవని చెప్పారు.



## తెలంగాణ గవర్నర్‌గా నేడు సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

హైదరాబాద్ : తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నియామకమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం రాత్రికి రాధాకృష్ణన్ హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. బుధవారం ఉదయం 11:15 గంటలకు సీపీ రాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాధాకృష్ణన్ చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణం చేయించనున్నారు. గవర్నర్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో రాజ్‌భవన్ వర్గాలు నిమగ్నమయ్యాయి.జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు.. తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. తమిళిసై గవర్నర్ పదవికి రాజీనామా చేయడంతో ఆ బాధ్యతలను రాధాకృష్ణన్‌కు అప్పగించినట్లు రాష్ట్రపతి భవన్ ఇవాళ ఓ ప్రకటనలో తెలిపింది. తెలంగాణ గవర్నర్ తమిళిసై రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదిం చారు. పూర్తి స్థాయి గవర్నర్లను నియమించే వరకు తెలంగాణ, పుదుచ్చేరి బాధ్యతలను నిర్వర్తించాలని రాధాకృష్ణన్‌ను కోరుతూ రాష్ట్రపతి భవన్ ఓ లేఖ రిలీజ్ చేసింది. బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి నియామకం అమలులోకి వస్తుందని రాష్ట్రపతి భవన్ ఆ రిలీజ్‌లో తెలిపింది.

ఉచిత కంప్యూటర్ మరియు టైలరింగ్ శిక్షణ

01 - 04 - 2024 నుండి ప్రారంభం
17 - 03 - 2024 తేది నుండి అప్లికేషన్లు ఇవ్వబడును

వివరముల కొరకు :
ఆవుల విజయభాస్కర్ రెడ్డి అడ్వకేట్, ఆళ్లగడ్డ
ఆవుల పుల్లా రెడ్డి సేవాసమితి,
టి.బి.రోడ్డు, ఆళ్లగడ్డ, నంద్యాల జిల్లా.
సెల్ : 9440232308, 9441808737

# సంపాదకీయం

బుధవారం 20-03-2024

## విశ్వాసమా... అతి విశ్వాసమా....

ఇండియా కూటమి చీలిపోయిందంటూ ఇటీవల ప్రభుత్వ అనుకూల మీడియా తరచూ ప్రచారం చేస్తున్న విషయం అందరికీ విదితమే. ఇకపోతే ప్రధాని మోదీ ఇటీవల బీజేపీ వివిధ రాష్ట్రాల ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతూ ఈసారి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మిత్ర పక్షాలను కలుపుకొని 400 సీట్లు గెలుస్తామని ఘంటాపథంగా చెప్పారు. దీన్నే ప్రామాణికంగా తీసుకొన్న వివిధ స్థాయుల్లోని బీజేపీ నాయకులూ బహుళ ప్రచారంలో పెట్టారు. అంతే కాకుండా జాతీయ స్థాయిలో మీడియా 'ఇండియా' కూటమి బలహీన పడిందంటూ బహుళ ప్రచారం చేస్తోంది. కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు కొంత భిన్నంగా ఉన్నాయి. ఇటీవలనే ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ పార్టీ?కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకున్నాయి. ఇక్కడ మొత్తం 80 పార్లమెంట్ స్థానాలు ఉండగా బీజేపీ గత ఎన్నికల్లో 62 స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు అక్కడ గతంలో గెలుచుకున్నన్ని స్థానాలు సంపాదించడం కష్టమని అంచనా. గతంలో సమాజ్ వాదీ పార్టీ, కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేశాయి. అప్పుడు సున్నితమైన పుల్వామా అంశం తెరపైకి వచ్చి ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపాయి. కాబట్టి బీజేపీకి ఎక్కువ సీట్లు వచ్చాయి. అంతేకాకుండా ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల పేపర్లు లీక్ కావటంతో యోగీ ప్రభుత్వం ఆ పరీక్షలను రద్దుచేసి మళ్లీ నిర్వహిస్తానని ప్రకటించింది. దీంతో యాభై లక్షలమంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఈ ప్రభావం రానున్న ఎన్నికలపై పడనుందని అంటున్నారు. అక్కడ ముఖ్యమంత్రి యోగి క్షత్రియ కులానికి చెందినవాడు. బ్రాహ్మణుల్లో తమకు యోగి ప్రభుత్వంలో సరియైన ప్రాతినిధ్యం లేదనే భావన ఉండటంతో ఈసారి ఆయనకు వ్యతిరేకంగా వారు పనిచేయవచ్చు. ఇక ఎన్డీయేలో భాగస్వామి అయిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తరచూ కూటములు మారటంతో ఆయన పలుకుబడి కుర్మీలలో బాగా తగ్గింది. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొంటే గతంలో బీజేపీకి వచ్చినన్ని సీట్లు ఈసారి రావనేది రాజకీయ పరి శీలకుల భావన. ఈ సీట్లలో చాలావాటిని 'ఇండియా' కూటమే గెలుచుకుంటుందంటున్నారు. ఇక బిహార్ విషయాని కొద్దాం. ముఖ్యమంత్రి నితీశ్ పిల్లిమొగ్గలతో మొత్తం ఎన్డీయే మీదే అక్కడి ఓటర్లలో వ్యతి రేకత బాగా ఏర్పడింది. ఇక్కడ ఈసారి లాలూప్రసాద్ పార్టీ ఆర్జేడీ బలం పుంజుకొంది. దీనికితోడు కాంగ్రెస్, కమ్యూ నిస్టులు ఈసారి అక్కడ కలిసి పోటీచేయాలనుకుంటు న్నారు. ఇది 'ఇండియా' కూటమికి ప్రయోజనం కలిగే అంశం. ఇక బెంగాల్‌లో మమతా ఒంటరి పోరేనంటోంది. అక్కడ త్రిముఖ పోటీ ఉండటంతో ప్రభుత్వ ఓట్లు చీలి టీఎంసీకి లబ్ధి చేకూరే అవకాశాలున్నాయి. రాజస్థాన్‌లో వసుంధరా రాజే తనను ముఖ్యమంత్రిగా చేయనందుకు రగిలిపోతోంది. ఆమె ఈసారి చురుగ్గా పనిచేయకపోవచ్చు. ఇక ఈశాన్యరాష్ట్రాలలో ఈసారి మణిపూర్ గొడవలు బీజేపీకి నష్టం చేకూర్చనున్నాయి. హిమాచల్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం 'ఇండియా' కూటమికి అనుకూలాంశం. కాంగ్రెస్?ఆప్ పొత్తు కుదుర్చుకున్నాయి కాబట్టి ఢిల్లీ, గోవా, గుజరాత్, హర్యానాలలో ఇండియా కూటమి మెరుగయ్యే అవకాశాలున్నాయి. మహారాష్ట్రలో ఎన్‌సీపీ, శివసేనలను చీల్చి బీజేపీ చేసిన రాజకీయాలు ఓటర్ల మనో ఫలకాలపై వ్యతిరేక ముద్ర వేసిందనే చెప్పాలి. ఇక దక్షిణాదిలో... కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, గత బీజేపీ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలు బీజేపీ అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎన్డీయే ఖాతా తెరిచేది గగనమే. తెలంగాణలో గతంలో 4 స్థానాలు గెలవగా ఇప్పుడు నిలబెట్టుకొని,స్థానాలుకైవసంచేసుకోగలదా అన్నది చూడాలి. బీజేపీ రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ ప్రజాబాహుళ్యంలోకి బాగా వెళ్లిందనీ, ఈసారి అదే అంశం బీజేపీకి అంటున్నారు. రాహుల్ 'భారత్ జోడో న్యాయ యాత్ర'కు ఉత్తర భారతంలో విశేష ప్రజాదరణ లభిస్తున్నందున బీజేపీకి అది అననుకూల అంశమే అవుతుంది. పైన పేర్కొన్న అనేక కారణాల వల్ల గత పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన స్థానాల కంటే 2024 ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గవచ్చని రాజకీయ పరిశీలకుల అంచనా. అందుకే, ఆ పార్టీ తమ 'టార్గెట్ 400' అంటూనే, వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలతో పొత్తుకు దిగుతోందని విశ్లేషణ.

## ముస్లిం మైనారిటీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తాను

### రాష్ట్ర మైనారిటీ సెల్ కమిటీ జాయింట్ సెక్రెటరీ షేక్ గౌస్ పీరా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 19–ఈ సందర్భంగా షేక్ గౌస్ పీర మాట్లాడుతూ...రాష్ట్ర మైనారిటీ సెల్ కమిటీ జాయింట్ సెక్రటరీగా తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మాజీమంత్రి శిల్పా మోహన్ రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియచేశారు . పార్టీ తనను గుర్తించి ఈ పదవీ బాధ్యతలను అప్పజెప్పడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి, ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో నంద్యాల పట్టణంలో ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి సారథ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ప్రతిపక్ష టిడిపి నాయకులు నంద్యాల పట్టణంలో అభివృద్ధి జరుగ లేదంటూ అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని, క్షేత్రస్థాయికి వెళ్లి చూస్తే అభివృద్ధి అంటే ఏంటో తెలుస్తుందన్నారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజలకు ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు. కేవలం 35 వ వార్డులో ఇటీవల మూడు కోట్ల 65 లక్షలతో ప్రధాన సిసి రోడ్డు నిర్మించడం జరిగిందని. అలాగే వార్డులో అభివృద్ధి చేపట్టారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## శేష వాహనంపై దర్శనం ఇచ్చిన శ్రీ జ్వాల నరసింహా స్వామి

ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 19 విభారె న్యూస్ :- ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి అహోబిలం 46వ పీఠాధిపతి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఎగువ అహోబిలంలో శ్రీ జ్వాల నరసింహస్వామి శేష వాహనంపై కొలువుదిరి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి పూజల అనంతరం అహోబిల మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన శ్రీ జ్వాల నరసింహుడు ఆలయ మాల వీధుల గుండా ఊరేగారు. దిగువ అహోబిలంలో.....దిగువ అహోబిలంలో గారుడ విమానంలో శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీ యోగానంద నరసింహస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా గారుడ విమానంలో అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం అహోబిల ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. అహోబిలం






మఠం చేరుకున్న ఉత్సవమూర్తులకు పీఠాధిపతి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీ ప్రహ్లాద వరద స్వామి హనుమంత వాహనంపై కొలువు దీరాడు. పూజలు నిర్వహించిన అనంతరం భాజా భజంత్రీల హర్షధ్వనుల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. జిపిఏ సంపత్, ఓఎస్డి శివప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతురామన్ ల సమక్షంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

## 2018 గ్రూప్-1 మెయిన్స్‌పై రాజకీయ విమర్శలా? : గౌతమ్ సవాంగ్



అమరావతి: 2018 మెయిన్స్ పరీక్ష రద్దుపై టీడీపీ నేతలు, ఎల్లో మీడియా అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్.సర్వీస్ కమిషన్, ప్రభుత్వంపైనా రాజకీయ విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. అసలు రాజకీయ విమర్శలకు కమిషన్ స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. అయితే నిరుద్యోగులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. 2018 గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష నిబంధనలకు అనుగుణంగా జరిగిందని గౌతమ్ సవాంగ్ తెలిపారు. మెయిన్స్ పరీక్ష ప్రశ్నాపత్రాలను పకడ్బందీగా ఒకేసారి మాన్యువల్ వ్యాల్యువేషన్ చేశామని, రెండోసారి జరగలేదని స్పష్టం చేశారు. 162 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు 55 రోజులు క్యాంపులో కూర్చుని వ్యాల్యువేషన్ చేశారన్నారు. వ్యాల్యువేషన్? ప్రక్రియ అంతా సీసీ కెమెరాలో రికార్డు చేసినట్లు తెలిపారు. నియామకాలకు సంబంధించి అన్ని ఆధారాలూ ఏపీపీఎస్సీ వద్ద ఉన్నాయని చెప్పారు. నియామకాల్లో ఏపీపీఎస్సీ చాలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఉద్యోగాలు చేస్తున్న 162 ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి న్యాయం జరిగేలా ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ క్రమంలో సోమవారం హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అప్పీల్ దాఖలు చేశారు. 2019 నుంచి ఇప్పటి దాకా కమిషన్ ఒక్క తప్పు లేకుండా పూర్తి పారదర్శకతతో వేలాది పోస్టులు భర్తీ చేసిందని పేర్కొన్నారు గౌతమ్ సవాంగ్. 2018 గ్రూప్–1 పోస్టుల భర్తీలోనూ అంతే పారదర్శకంగా మెయిన్స్, ఇంటర్వ్యూలు నిర్వహించాయని చెప్పారు. ఎంపికైన అభ్యర్థుల్లో 14 మంది ఐఏఎస్‌కు ఎంపికవ్వడమే అందుకు నిదర్శనమని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో దేశంలోని 15 రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు వివాదాల్లో చిక్కుకుంటే, వివాద రహితంగా ఉద్యోగాలు భర్తీ చేసిన బోర్డుగా ఏపీపీఎస్సీ ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు దాదాపు 78 నోటిఫికేషన్లు ఇచ్చి, 6,296 ఉద్యోగాలను వివాదరహితంగా భర్తీ చేసిందని తెలిపారు. బాబు హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి వివాదాల్లో ఉన్నవాటిని సైతం పరిష్కరించి, పోస్టుల భర్తీ ప్రక్రియను సీఎం జగన్ ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. ఇందులో విద్యావంతులైన నిరుద్యోగ యువతకు మేలు చేసేలా గ్రూప్–1, గ్రూప్–2 వంటి గెజిటెడ్ పోస్టులతోపాటు, వివిధ శాఖల్లో అసిస్టెంట్ ఇంజినీర్లు, అగ్రికల్చరల్ ఆఫీసర్లు, మరెన్నో నాన్ గెజిటెడ్ పోస్టులకు నియామకాలు జరిగాయని తెలిపారు. 2018లో బాబు హయాంలో గ్రూప్–1 విషయంలో వివాదాలు తలెత్తినట్లు గౌతమ్ సవాంగ్ పేర్కొన్నారు. 2018 మే నెలలో నిర్వహించిన ప్రిలిమ్స్ పేపర్‌లో దాదాపు 62 తప్పులు దొర్లాయని చెప్పారు. వీటికి నాటి చంద్రబాబు ప్రభుత్వంగానీ, నాటి సర్వీస్ కమిషన్ చైర్మన్ ఉదయ్ భాస్కర్గానీ సమాధానం చెప్పలేదని ప్రస్తావించారు. గ్రూప్–1 మెయిన్స్ పేపర్లను సంప్రదాయ పద్ధతిలో సబ్జెక్టు నిపుణులు మూల్యాంకనం చేయడం ఎప్పటి నుంచో ఉండగా..డిజిటల్ మూల్యంకనం ప్రతిపాదన నాటి చైర్మన్ ఉదయ్ భాస్కర్‌దేనని అన్నారు. సంప్రదాయ పద్ధతి విధానంలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పి ఉదయ్ భాస్కర్ డిజిటల్ మూల్యాంకనం ప్రతిపాదన చేయగా, నాటి కమిషన్‌లోని సభ్యులు కూడా ఆమోదం తెలిపి కొత్త ప్రభుత్వం ముందుంచారని చెప్పుకొచ్చారు. అనంతరం దీనిపై జాతీయ స్థాయి సదస్సును విజయవాడలో నిర్వహించేందుకు సన్నాహాలు చేయగా అందుకు ప్రభుత్వం నిధులు కూడా కేటాయించిందని తెలిపారు. మెయిన్స్ పేపర్లను ఈ విధానంలోనే మూల్యాంకనం చేయాలని చూడగా.. నోటిఫికేషన్‌లో చెప్పని కారణంగా కోర్టు ద్వారా ఈ ప్రక్రియను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. దీంతో సంప్రదాయ విధానంలోనే పేపర్లను మూల్యాంకనం చేశారన్నారు.'2018 గ్రూప్–1 ఇంటర్వ్యూలకు 325 మంది ఎంపిక అయ్యారు. ఇందులో ఐఐటీ నుంచి 19 మంది, ఐఐఎం నుంచి 7, ఎన్ఐటీ నుంచి 17, బిట్స్ పిలానీ నుంచి 2, ట్రిపుల్ ఐటీల నుంచి 13 మంది ఉన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ చేసినవారు 177 మంది, సాధారణ పీజీ 51, గ్రాడ్యుయేట్లు 39 మంది ఉన్నారు. ఇక ఇంటర్వ్యూకు ఎంపికైన వారిలో 40 మంది సివిల్స్ రాయగా.. వీరిలో 14 మంది అదే ఏడాది ఐఏఎస్ సాధించగా, ఇద్దరు కేంద్ర సర్వీసుకు ఎంపికయ్యారు.మరో 24 మంది యూపీఎస్సీ ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. 163 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్నారు. వీరంతా 2018 గ్రూప్–1 కంటే ముందే పలు పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలు ఎదుర్కొన్నవారు. వీరంతా మెయిన్స్‌లో ప్రతిభ చూపిన తర్వాతే ఇంటర్వ్యూని ఎదుర్కొన్నారు. సివిల్స్ ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుకుని చదివినవారికి గ్రూప్–1లో గెలవడం లెక్కకాదు' అని తెలిపారు.

## మూడు పార్టీల సభ అట్టర్ ప్లాప్: మంత్రి అంబటి



సత్తెనపల్లి: మూడు పార్టీల సభ అట్టర్ ప్లాప్.. ప్రధాని హాజరైన సభను కూడా సరిగ్గా నిర్వహించలేకపోయారంటూ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 2014లో ఇదే కూటమి కలిసి పోటీ చేసి అధికారంలోకి వచ్చింది.. ఆ తర్వాత రాష్ట్రాన్ని ఎంత ఆగం చేశారో అందరికీ తెలుసు అంటూ మండిపడ్డారు."నాడు విడిపోయి ఒకరినొకరు తిట్టుకున్నారు. ప్రధానిని ఆనాడు చంద్రబాబు ఏమన్నారో ప్రజలకు గుర్తుంది. పొరపాటున ఓటు వేసిన పాపానికి రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారు. ప్రజాగళం ఏం సందేశం ఇచ్చింది?. ముగ్గురు కలిసి పోటీ చేసినా సీఎం జగన్‌ను ఓడించలేరు. చంద్రబాబు జీవితమంతా అభద్రతాభావంతో బతుకుతున్నారు. ప్రజాగళం సభలో మైక్ మూగబోయింది. మైక్ కూడా సరిచేసుకోని వారు రాష్ట్రాన్ని ఎలా నడుపుతారు?" అంటూ ప్రశ్నించారు."సీఎం జగన్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సీఎం జగన్ పరుగులు పెట్టించారు. సీఎం జగన్ సభలకు ప్రజలు తరలివస్తున్నారు. ఆ మూడు పార్టీల సభలను జనం పట్టించుకోవడం లేదు. పవన్‌తో కాదని తెలిసి మోదీతో పొత్తు పెట్టుకున్నారు. చంద్రబాబు అండ్ కో ఎంత బురదజల్లినా ప్రజల గుండెల్లో ఉన్న జగన్‌ను ఏమీ చేయలేరు" అని మంత్రి అంబటి రాంబాబు తేల్చి చెప్పారు.

## కప్పట్రాళ్ళ గ్రామంలో 6 సం.ల బాలునికి డెంగ్యూ కేసు నమోదు

దేవనకొండ మండలం కప్పట్రాళ్ళ గ్రామంలో 6 సం" బాలునికి డెంగ్యూ జ్వరం వచ్చునట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు ఈ సందర్భంగా గ్రామంలో దోమల మందును పిచికారి చేయించి బాలుని ఇంటిపరిసరాలు శుభ్రం చేయించి ఇంటి లోపల కూడా దోమల నివారణకు ముందును పిచికారి చేయించండము జరిగినది ప్రజలకు దోమల ద్వారా వ్యాపించు వ్యాధులు గూర్చి అవగాహన కల్పించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి ని ప్రజలను కోరారు ఇందులో సూపర్వైజర్ రంగస్వామి ఓఒఊఖ మరియు ంఆెఓ పంచాయితీ సెక్రటరీ ఆశలు పాల్గొనట్లు తెలియ చేసినారు



# కడప నుంచి బరిలో షర్మిల

కడప, మార్చి 19 కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పోటీ చేయనున్నారు. షర్మిలను కడప ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ నాయకత్వం సూచించినట్లు తెలుస్తోంది. పార్టీ సూచిస్తే ఎన్నికల్లో పోటీ చేస్తానని షర్మిల చెబుతూ వచ్చారు. ఇప్పుడు పార్టీ నాయకత్వం ప్రధానంగా ఎంపీ స్థానాల పైనే ఫోకస్ చేస్తోంది. అయితే, పార్టీ సూచన పైన షర్మిల తుది నిర్ణయం తీసుకోవాల్సి వస్తోంది. ఎన్నికల బరిలో షర్మిల కడప ఎంపీగా వివేకా సతీమణి సౌభాగ్యమ్మను బరిలోకి దింపాలని టీడీపీ ఆలోచన చేస్తున్నట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. అయితే, సౌభాగ్యమ్మను కాంగ్రెస్ నుంచే పోటీ చేయించాలనే మరో ఆలోచన తాజాగా జరిగిన వివేకా సంస్మరణ సభలో ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ నాయకత్వం షర్మిలను కడప ఎంపీగా బరిలోకి దిగాలని సూచిస్తుండటంతో...వివేకా కుటుంబం నుంచి పోటీ ఉండదనే అంచనా వ్యక్తం అవుతోంది. వైసీపీ నుంచి వరుసగా రెండు సార్లు ఎంపీగా గెలిచిన అవినాశ్ రెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. వివేకా కుమార్తె సునీత తన తండ్రి హత్య కేసులో అవినాశ్ పైన పలు ఆరోపణలు చేసింది. వైసీపీకి ఓటు వేయద్దంటూ తాజాగా తన తండ్రి సంస్మరణ సభలో పిలుపునిచ్చింది. మాజీ సీఎం చెవిలో బాంబు పేల్చిన హోం మంత్రి అమిత్ షా, హీరో విషయంలో జాగ్రతగా చూసుకోండి! షర్మిల నిర్ణయంపై ఉత్కంఠ ఇప్పుడు షర్మిల ఎంపీగా పోటీ చేయాలంటూ హైకమాండ్ సూచిస్తుండడటంతో బరిలోకి దిగుతారా లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఈ నెల 25న ఏపీ కాంగ్రెస్ అభ్యర్దుల జాబితా విడుదల కానుంది. పులివెందుల నుంచి



జగన్ పోటీ చేస్తుండంతో టీడీపీ అభ్యర్దిగా బీటెక్ రవి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఎవరు బరిలో ఉంటారనేది ఇంకా తేలలేదు. దీంతో, షర్మిల ఎంపీగానే పోటీ చేస్తారా..లేక ఎమ్మెల్యేగా ఎన్నికల బరిలోకి దిగుతారా అనేది ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది.కడప నుంచి పోటీ చేయాలని ఆమెపై కాంగ్రెస్ అధిష్టానం ఒత్తిడి తెచ్చింది. హస్తం పెద్దల కోరిక మేరకు ఆమె కడప ఎంపీగా పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ నెల 25న కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేయనున్నారు. అటు, రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ కు పూర్వ వైభవం తెచ్చేలా షర్మిలతో పాటు ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విశాఖలో 'న్యాయ సాధన సభ' పేరిట నిర్వహించిన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ పై విమర్శలు గుప్పించారు. వచ్చే ఎన్నికల్లో ఏపీ ప్రజలు షర్మిలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కాగా, త్వరలోనే తొలి జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో ప్రచారం మరింత ముమ్మరం చేసేలా షర్మిల నేతలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'ప్రజాగళం' సభపై షర్మిల ట్విట్టర్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. అటు చంద్రబాబు ను, ఇటు జగన్ ను 2 పంజరాల్లో పెట్టుకుని ఆడిస్తోన్న రింగ్ మాస్టర్ బీజేపీ అంటూ మండిపడ్డారు. పదేళ్ల రాష్ట్ర వినాశనంలో ముఖ్య పాత్ర పోషించిన పార్టీ బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం అంటూ ఆమె నిప్పులు చెరిగారు. 'కాంగ్రెస్, వైసీపీ ఒకటే అని ప్రధాని మోదీ కూతలా? ఐదేళ్లుగా జగన్ తో అంటకాగిందెవరు. వైసీపీ నేతల అరాచకాలను అడ్డుకోకుండా, ఎదురు వారికి అడ్డగోలు సహాయ సహకారాలు అందించింది బీజేపీ. ఇంకా నాశనం చేసుకోండి, అప్పుతెచ్చుకోండి అంటూ తెరచాటు స్నేహం నడిపింది ఎవరో,? దత్తపుత్రుడు అన్నది ఎవరినో.?' అంటూ సెటైర్లు వేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు సిగ్గువిడిచి సపోర్ట్ చేసింది జగన్ రెడ్డి సర్కారు అని షర్మిల ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ మిత్రులు అదానీ, అంబానీలకు రాష్ట్రంలో ఆస్తులు కట్టపెట్టి, వారికీ రాజ్యసభ సీట్లు ఇచ్చింది జగన్ సర్కారు అని ఆరోపించారు. ఇది వీరి స్నేహం, విడదీయరాని బంధం అంటూ జగన్ పై సెటైర్లు వేశారు. 'హామీలు ఇచ్చింది కాంగ్రెస్, వాటిని తుంగలో తొక్కింది బీజేపీ, టీడీపీ, వైసీపీ. ఇప్పుడు ఆ అసమర్థత, మోసాలను కప్పిపెట్టాలని కాంగ్రెస్ మీద పసలేని దాడులు చేస్తున్నారు.

## వలంటీర్లకు ఈసీ మార్క్ షాక్

ఒంగోలు మార్చి 19 అనుకున్నట్టే అయ్యింది. వాలంటీర్లకు జగన్ దెబ్బ తగిలింది. వారి ఉనికి ప్రశ్నార్థకం కానుంది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వలంటీర్లపై చర్యలు తప్పవని ఎన్నికల కమిషన్ హెచ్చరించింది. రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లపై దాడులు పెరుగుతున్నాయి. ఎక్కడికక్కడే వారిని టిడిపి, జనసేన శ్రేణులు నిలువరించే ప్రయత్నం చేస్తున్నాయి. కడప జిల్లాలో అయితే వలంటీర్ పై దాడి జరిగింది. ఇంటింటికి వెళ్లి వైసిపి కరపత్రాలు అందించడమే కారణం. .వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ల వ్యవస్థను ప్రారంభించారు.

# అస్త్రాలు, శస్త్రాలు సిద్ధం

విజయవాడ, మార్చి 19 సార్వత్రిక ఎన్నికలతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఏపీలో అధికారంలోకి రావడంతో పాటు మెజారిటీ లోక్ సభ స్థానాలను దక్కించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీనికి అవసరమైన అస్త్ర శస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తి చేశాయి. ప్రచారం పర్వం పై దృష్టిపెట్టాయి. ఈ విషయంలో జగన్ దూకుడు మీద ఉన్నారు. ఏకకాలంలో అభ్యర్థులను ప్రకటించడంతో పాటు రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో సిద్ధం సభలను పూర్తి చేశారు. ఇప్పుడు ఆసక్తికరమైన మేనిఫెస్టోను ప్రజల ముందుకు తెచ్చేందుకు సిద్ధపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన పర్యటన ఉండేలా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నారు.తెలుగుదేశం పార్టీ జనసేన, బిజెపితో జత కట్టిన సంగతి తెలిసిందే. ఆ మూడు పార్టీలు సైతం ఎన్నికల ప్రచార సభను నిర్వహించాయి. చిలకలూరిపేట లో జరిగిన భారీ బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరయ్యారు. వైసీపీని టార్గెట్ చేశారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తామని చెప్పుకొచ్చారు. ఏపీలో వైసీపీ సర్కార్ అవినీతి మయంగా మారిందని మోదీ ఆరోపణలు చేశారు. దీంతో వైసిపి పై ప్రధాని మోదీ అభిప్రాయం మారిందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అందుకే జగన్ సైతం దూకుడు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ 57 రోజులపాటు ఎన్నికల ప్రచార సభలతో హోరెత్తించాలని భావిస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసి.. ప్రజల్లోకి బలంగా వెళ్లాలని చూస్తున్నారు. ఈరోజు పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మేనిఫెస్టో తో పాటు ఎన్నికల నిర్వహణపై వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. కీలక అంశాలపై వారికి దిశా నిర్దేశం చేయనున్నారు.మేనిఫెస్టో విషయంలో జగన్ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత ఎన్నికలకు ముందు నవరత్నాలను ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేసే ప్రయత్నం చేశారు. ఇప్పుడు కూడా నవరత్నాలకు తలదన్నేలా మేనిఫెస్టో ప్రకటించాలని చూస్తున్నారు. మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని మేనిఫెస్టోను రూపకల్పన చేసినట్లు వైసిపి నేతలు చెబుతున్నారు. ఈనెల 20న మ్యానిఫెస్టో విడుదలకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెల్లడి కావడంతో.. పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఏపీకి సంబంధించి మే 13న పోలింగ్ జరగనుంది. ఈ లెక్కన దాదాపు 57 రోజుల గడువు ఉంది. అందుకే మ్యానిఫెస్టో విడుదల తేదీని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నారు. ఏప్రిల్ 11 లేదా 12న విడుదల చేయాలని భావిస్తున్నారు. తొలి దశ పోలింగ్ 19వ తేదీన జరగనుండడంతో అక్కడికి వారం రోజులు ముందు మేనిఫెస్టో విడుదలకు నిర్ణయం తీసుకోవడం విశేషం.

# ఎన్నికల వేళ పక్కా వ్యూహంతో జగన్

విజయవాడ, మార్చి 19 ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత ఏపీలో పొలిటికల్ హీట్ మరింత పెరిగింది. ఓ వైపు ప్రతిపక్షాలు కూటమి కడితే? మరోవైపు సింగిల్‌గా, పక్కా ప్రణాళికతో జనాల్లోకి వెళ్తున్నారు వైసీపీ అధినేత సీఎం జగన్. ఇందులో భాగంగా ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారాన్ని మరింత హోరెత్తించనున్నారు వైసీపీ బాస్.దేశంలోనే బెస్ట్ సీఎం అవుతా? రాష్ట్రానికి 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలి. ఇవి జగన్ అధికారం చేపట్టినప్పుడు చెప్పిన మాటలు. ఇప్పుడు ఐదేళ్ల పాలన తర్వాత జగన్ ఎన్నికలను ఎదుర్కొంటున్నారు. దీంతో వైసీపీకి ఈ ఎలక్షన్లు అత్యంత కీలకంగా మారాయి. ఐదేళ్ల పాలన తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ఇది పరీక్షా కాలంగా వైసీపీ భావిస్తోంది.ప్రభుత్వ పాలన మొదలైనప్పటి నుంచి ఎన్నికల మ్యానిఫెస్టో అమలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు జగన్. మ్యానిఫెస్టో 99 శాతం అమలు చేశామని తెలిపారు. గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని చేసినందుకే ఈసారి 175 టార్గెట్ పెట్టుకుని రంగంలోకి దిగుతున్నట్లు జగన్ చెబుతున్నారు. ఎన్నికలకు కౌంట్ డౌన్ మొదలుకావడంతో సీఎం జగన్ ప్రచార పర్వానికి రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే సిద్ధం సభలతో ప్రాంతా ల వారీగా పర్యటించిన జగన్? ఎన్నికల క్యాంపెయిన్ ఈ నెలలోనే ప్రారంభించ బోతు న్నారు. ఇప్పటికే బహిరంగసభలతో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపిన జగన్? ఇప్పుడు మరింత స్పీడుగా జనాల్లోకి వెళ్లనున్నారు.ఎన్నికల క్యాంపెయిన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని నియోజకవర్గాల్లో ఎన్ని రోజులు పర్యటించాలి. ఏ జిల్లాలో ఎప్పుడు పర్యటించాలి, సభలు ఎక్కడ నిర్వహించాలి, రోడ్ షోలను ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై పార్టీ పక్కా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర చేసి 151 నియోజకవర్గాల్లో గెలిచిన వైసీపీ? ఇప్పుడు వై నాట్ 175 నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. 2019 విజయాన్ని రిపీట్ చేయాలని వైసీపీ భావిస్తోంది. అందులో భాగంగానే ప్రచారాన్ని ఉధృతం చేస్తూ రోడ్ షోలు, సభలతో విస్తృతంగా ప్రజలకు దగ్గరయ్యేలా షెడ్యూల్ ఫిక్స్ చేయనుంది.వై నాట్ 175 నినాదాన్ని బలంగా తీసుకొని వెళ్లడంతో పాటు.. ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించనున్నారు వైసీపీ నేతలు. జగన్ సింగిల్‌గా సిద్ధం అంటుంటే? ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా మారి వైసీపీపై యుద్ధానికి దిగుతున్నాయి. ఓ వైపు చంద్రబాబు, మరో వైపు పవన్‌తోపాటు బీజేపీ కూటమిలో ఉండడంతో ఎన్నికలు పోటాపోటీగా ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికలు జగన్‌కు మరింత కీలకంగా మారాయి. ఐదేళ్ల పాలనకు ప్రజలు ఎన్ని మార్కులు వేస్తారో చూడాలి.



# పిఠాపురం..గరం.. గరం

కాకినాడ, మార్చి 19 కాకినాడ జిల్లా పిఠాపురంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పిఠాపురం నుంచి తానే పోటీ చేస్తున్నట్లుగా పవన్ కల్యాణ్ ప్రకటించడంతో వైసీపీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. పిఠాపురం నుంచి పవన్ ను ఓడించడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. కాపు నేత ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరిన కాసేపటికే.. పిఠాపురం ఇంఛార్జి వంగా గీత క్యాంప్ ఆఫీసుకి వెళ్లడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పిఠాపురం నుంచి పోటీ చేస్తానన్న పవన్ కల్యాణ్ ప్రకటనతో.. అప్రమత్తమైన వైసీపీ అందరినీ ఏకం చేసే పనిలో పడింది.పిఠాపురంలో పవన్ ను ఓడించడమే లక్ష్యంగా వైసీపీ అడుగులు వేస్తోంది. ఇక్కడి నుంచి ముద్రగడను బరిలోకి దించాలా? లేక ఆయన కుమారుడిని పవన్ పై పోటీకి నిలపాలా? అనే దానిపై చర్చించింది. వీరిద్దరూ కాకపోయినా వంగా గీతను పవన్ కల్యాణ్ పై పోటీకి నిలపాలని చూస్తోంది. అయితే, గతంలోనూ పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ముద్రగడ ప్రకటించారు. దమ్ముంటే తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఈ ముగ్గురిలో ఎవరు పోటీలో ఉండాలో నిర్ణయించనుంది వైసీపీఇక, మరోవైపు పిఠాపురంలో అసమ్మతి సెగలు భగ్గుమన్నాయి. టికెట్ రాలేదని అసంతృప్తితో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎస్ వీఎస్ ఎన్ వర్మ.. ఇవాళ కార్యకర్తలు అనుచరులతో సమావేశం కానున్నారు. పిఠాపురం నుంచి ఇండిపెండెంట్ గా బరిలోకి దిగేందుకు ప్లాన్ చేస్తున్నారు. అయితే వర్మ సైతం వైసీపీకి టచ్ లోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ వైసీపీలోకి వెళ్లకపోయినా ఇండిపెండెంట్ గా పోటీ చేయాలని చూస్తున్నారు. గతంలో పిఠాపురం నుంచి వంగా గీత విజయం సాధించారు.ఒకవేళ ముద్రగడ పద్మనాభం లేదా ఆయన కుమారుడు పోటీ చేసినా సపోర్ట్ ఇవ్వాలని వంగా గీత ప్లాన్ చేస్తున్నారు. అటు పవన్ పై ఎవరు పోటీ చేస్తే బాగుంటుంది అనే చర్చ కూడా వచ్చింది. 2009లో ఇదే పిఠాపురం నుంచి వర్మ, వంగా గీత, ముద్రగడ పోటీ చేశారు. ఇప్పుడు వర్మతో టచ్ లోకి వెళ్లాలని భావిస్తున్నారు. ఒకవేళ వర్మ వైపీపీలోకి వెళితే ఈ ముగ్గురు పవన్ ను కట్టడి చేసేలా వైసీపీ ప్లాన్ చేస్తోంది.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పిఠాపురం నియోజకవర్గం టీడీపీ-జనసేన పార్టీల్లో తారెత్తించిన సంగతి తెలిసిందే. పిఠాపురం నుంచి పోటీచేస్తున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటనతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. తనకు సీటుకు దక్కలేదని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ వర్మ తీవ్ర మనస్తాపానికి గురవ్వడం.. అభిమానులు, అనుచరులు, కార్యకర్తలు ఆగ్రహంతో రగిలిపోయి వీరంగం సృష్టించడం.. ఆఖరికి చంద్రబాబు, పవన్, లోకేష్‌పై పచ్చిబూతుల వర్షం కురిపించిన పరిస్థితి. సీన్ కట్ చేస్తే.. ఇప్పుడు సేనాని-వర్మ కలిసిపోయారు.. అంతా కూల్ అయిపోయింది. ఆందోళనలు మొదలుకుని ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానంత వరకూ వచ్చిన వ్యవహారానికి ఫుల్‌స్టాప్ ఎక్కడ పడింది..? వర్మ ఎక్కడ కమిట్ అయ్యారు..? ఆయనకొచ్చిన హామీ ఏంటనే విషయాలు ఇప్పుడు చూద్దాం..ఎట్టి పరిస్థితుల్లో వైసీపీ అధికారంలోకి రానివ్వకూడదన్నదే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి టార్గెట్. ఇందుకోసం ఏ చిన్నపాటి అవకాశం వచ్చినా వదులుకోకుండా సద్వినియోగం చేసుకుంటోంది కూటమి. ఈ పరిస్థితుల్లోనే గోదావరి జిల్లాలను తొలుత ఎంచుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరిలో జిల్లాను క్లీన్ స్వీప్ చేయడానికి వ్యూహ రచన చేసింది. ఇందులో భాగంగానే పవన్ పిఠాపురం ఎంచుకోవడం జరిగింది. సేనాని ఇక్కడ్నుంచి పోటీచేస్తే.. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో గెలవచ్చన్నది టార్గెట్ అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పైగా కాపు సామాజిక వర్గం కూడా 75 శాతం ఉండటంతో కచ్చితంగా గెలవచ్చన్నది ప్లాన్. అయితే.. తనకు కంచుకోటగా మలుచుకున్న వర్మ మాత్రం అందుకు మొదట అంగీకరించలేదు.. కానీ చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసి పిలిపించి సర్దిచెప్పడంతో కూల్ అయ్యారు వర్మ. పనిలో పనిగా ఆయనకు కీలక హామీలు ఇవ్వడంతో పాటు.. సముచిత స్థానం ఇస్తానని మాటిచ్చారు కూడా.

# దిగొస్తున్న కోడి ధరలు




నెల్లూరు, మార్చి 19 కొండెక్కిన కోడి ధరలు దిగివస్తున్నాయి. దీంతో మాంసాహార ప్రియులు ఖుషీ అవుతున్నారు. నిన్న ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లో చికెన్ స్కిన్‌లెస్ కిలో రూ.200 నుంచి 220 ధర పలికింది. వారం రోజుల క్రితం వరకు మార్కెట్ లో కిలో చికెన్ రూ.280 నుంచి రూ.310 ధర పలకగా క్రమేపీ ధరలు తగ్గుతూ వచ్చాయి. సుమారు రూ.80 నుంచి రూ.100 ధర తగ్గడంపై నాన్వెజ్ ప్రియుల ఆనందానికి అవధుల్లేవు. రాష్ట్రంలో కోళ్ళ లభ్యత పెరగడమే ధరలు తగ్గుదలకు కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ఎండలు ముదిరితే కోళ్ళు మృత్యువాత పడతాయని అప్పుడు ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.నెల్లూరు బర్డ్ పూర్తి ప్రభావం కారణంగా కోళ్ళు మృత్యువాత పడటంతో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. కోళ్ళతో పాటే గుడ్డు ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. గతనెల్లో రూ.7 పలికిన గుడ్డు ధర ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో రూ.6 నుంచి రూ.6.50 ధర పలుకుతోంది. హోల్సేల్ మార్కెట్లో రూ.5 నుంచి రూ.5.50 ధర పలుకుతోంది. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ గత నెల్లో చికెన్ ధరలు భగ్గుమన్నాయి. కేజీ రూ.300 ధర దాటేయడంతో మాంసాహార ప్రియులపై అదనపు భారం పడింది. బర్డ్ ఫ్లూ కారణంగా పెద్ద సంఖ్యలో కోళ్ళు మృత్యువాత పడటం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుంచి కోళ్ళ సరఫరాను నిలిపివేయడం తదితర కారణాలతో చికెన్ ధరలు పెరిగాయి. కోళ్ళ ఉత్పత్తి తగ్గడం ధరల పెరుగుదలకు కారణం అయిందన్న వాదనలు వినిపించాయిచికెన్ కేజీ రూ.300 దాటేయడంతో కొనుగోళ్ళపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. కార్తీక మాసంలో మాంసం ధరలు భారీగా పడిపోయాయి. అప్పట్లో కేజీ చికెన్ రూ.130 నుంచి రూ.140కు విక్రయించారు. దీంతో పౌల్ట్రీ నిర్వాహకులు భారీగా నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. కోళ్ళ పెంపకాన్ని తగ్గించారు. ఇటీవల బర్డ్ ఫ్లూ సోకి కోళ్ళు మృత్యువాత పడ్డాయి, దీంతో ధరలకు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇప్పట్లో దరలు తగ్గే అవకాశం లేదనుకుని ఉన్న తరుణంలో అనూహ్యంగా ధరలు తగ్గడంపై నాన్వెజ్ ప్రియులు ఖుషీ అవుతున్నారు. ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచా రాలు నిర్వహిస్తున్నారు.

# అనకాపల్లి వైసీపీ బరిలో బండారు

విశాఖపట్టణం, మార్చి 19 విశాఖకు చెందిన టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణకు వైసీపీ బంఫర్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దుర్తి నియోజకవర్గ టీడీపీ నేత బండారు సత్యనారాయణ మూర్తి పార్టీ మారుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పొత్తుల్లో భాగంగా పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీకి కేటాయించారు. ఈ కారణంగా ఆయన తీవ్ర అసంతృప్తికి గుర్యయారు. పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. నేను పార్టీ వీడుతున్నానని వస్తున్న వార్తలను మీడియాలో చూస్తున్నాను. ఈ వార్తలపై నా సమాధానం 'నో' కామెంట్స్ అంతే అని బండారు సత్యనారాయణ మూర్తి చెబుతున్నారు. కార్యకర్తలు, నా శ్రేయోభిలాషులతో చర్చలు జరుపుతున్నాను. వారి అభిప్రాయాలను తీసుకుంటాను. ఆపై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. రెండు, మూడు రోజుల్లో మీడియా మీట్ పెట్టి అన్ని విషయాలు చెబుతానని ప్రకటించారు. వైసీపీ నుంచి బండారుకు పిలుపు వచ్చిందని.. ముఖ్యనేతలు కొందరు టచ్‌లోకి వెళ్లగా పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నారని పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. వైసీపీ తీర్థం పుచ్చుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నారనే తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే త్వరలోనే వైసీపీ తీర్థం పుచ్చుకుంటారని.. ఈయనతో పాటు మరికొందరు టీడీపీ నేతలు కూడా సైకిల్ దిగుతారని టాక్ నడుస్తోంది. బండారుకు అనకాపల్లి ఎంపీ టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని విశాఖలో ప్రచారం జరుగుతోంది. అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థిని ప్రకటించినా అనకాపల్లికి మాత్రం ప్రకటించలేదు. బీసీ అభ్యర్థికి ఇస్తామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నుంచి ఆయనకు ఈసారి టికెట్ దక్కలేదు. పెందుర్తి టికెట్ ఆశించిన బండారుకు టీడీపీ విడుదల చేసిన లిస్టులో ఆశాభంగం కలిగింది. పెందుర్తి సీటు జనసేనకు దక్కింది. దీంతో మనస్థాపంలో ఉన్న బండారుకు వైసీపీ గాలం వేస్తోంది. తమ పార్టీలోకి తీసుకునేందుకు నాయకులు ప్రయత్నం చేస్తున్నారు.

## ఎమ్మిగనూరులో టిడిపి జెండా ఎగురవేసి బాబుకి గిఫ్ట్ గా ఇస్తాము..

-కాబోయే ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వరరెడ్డి..



ఎమ్మిగనూరు మార్చి 19 విభారె న్యూస్..మంగళవారం పట్టణంలోని 5వ వార్డు యందు వార్డులోని టిడిపి నాయకులు,కార్యకర్తలతో కలిసి పర్యటించి వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి అధికార వైసిపి పార్టీ హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకొని రాబోవు రోజులలో టిడిపి - జనసేన ఉమ్మడి పార్టీల ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజలకు లబ్ధి చేకూర్చే సూపర్ 6 పథకాలను గురించి ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరుతున్న ఎమ్మిగనూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి డా బి వి జయనాగేశ్వర రెడ్డి.

## చెన్నకేశవస్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన బుట్టా రేణుక..



ఎమ్మిగనూరు మార్చి 19 విభారె న్యూస్. 19-03-2024 తేదీన ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు మండల పరిధిలోని కందనాతి గ్రామంలో ముందుగా శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ మారెమ్మ అవ్వ దేవర సందర్భంగా గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ అవ్వ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక,ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు,పట్టణ 33వ వార్డు ఇన్ ఛార్జ్ వడ్డెవీరేష్,అధికార ప్రతినిధి సునీల్ కుమార్,మాచాని రఘు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అకస్మిక తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 19-. నంద్యాల జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్ . వెంకటరమణ మంగళవారం యర్రగుంట్ల మరియు చాపిరేవుల ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికముగా తనిఖీలు చేశారు.. ఈ ఆకస్మిక తనిఖీలో భాగముగా ప్రాదమిక ఆరోగ్య కేంద్రము లోని ఓపి నందు రోగులకు అందుచున్న ఆరోగ్య సేవల మీదఆరా తీశారు . అలాగే మందుల గదిని పరీక్షించారు , ల్యాబ్ నందు అందుబాటులో ఉన్నటువంటి పరీక్షలను తనిఖీలు చేశారు . జాతీయ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కార్యక్రమలైనటువంటి పోర్టల్ ను, కుష్టు వ్యాది కి గుర్తించడానికి ఇంటి ఇంటి సర్వే నిర్వహించవలేనని మరియు టీబి ముక్త్ భారత్ కార్యక్రమాన్ని పటిష్టముగా అమలు చేయవలెనని అందుకు సంభందించిన రిజిస్టర్లను మరియు రికార్డులను తనిఖీ చేశారు ప్రతి ప్రాధమిక మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పనిచేయుచున్న సచివాలయ ఆరోగ్య కార్యకర్తలను మరియు స్టాఫ్ నర్స్ లను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ నందు నమోదు చేయవలెనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించండి

పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో / జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య...



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 19- పాణ్యం నియోజకవర్గంలోని కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో / జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో, సంబంధిత అధికారులతో పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో / జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో / జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాకేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సమీక్షకు హాజరైన రాజకీయ పార్టీ ప్రతినిధులకు జాయింట్ కలెక్టర్ సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గనికి పోటీ చేసే అభ్యర్థి 40 లక్షల రూపాయలకు మించి ఖర్చు చేయరాదన్నారు. అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్టైజ్మెంట్స్ లకు సంబంధించిన రెట్ కార్డు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. సంబంధిత రేటింగ్ కార్డు ప్రకారమే తొలుతగా అనుమతి తీసుకొని ప్రచారాలు నిర్వహించుకోవాలన్నారు. పార్టీ అభ్యర్థులు పర్మిషన్ తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతులు తీసుకొని సభలు నిర్వహించుకోవాలన్నారు. యం సి సి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీం, తదితర టీములు నియోజకవర్గంలో పర్యవేక్షిస్తుంటారన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఆన్లైన్లో వివిధ రకాల పర్మిషన్ల కొరకు ఎలా దరఖాస్తు చేసుకోవాలనే విషయంపై పి పి టి



ద్వారా రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశారు. కొంతమంది రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ ప్రారంభమైన ఇంకా కొంతమంది రాజకీయ నాయకుల ఫోటోలు అలాగనే ఉన్నాయని అన్నారు. అటువంటివి ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకొని వస్తే తక్షణమే వాటిని మూసివేయిస్తామని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. నియోజకవర్గంలోని ఏ ఈ ఆర్ ఓ లు.. వారికి సంబంధించిన సిబ్బందితో సమన్వయంతో వ్యవహరించి ఎన్నికల విధుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలన్నారు. యం సి సి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వీవింగ్ టీం, తదితర టీముల నెంబర్లందరూ ఎన్నికలలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మండల తహశీల్దారులు ఓర్వకల్లు - నటరాజ్, పాణ్యం - ఫణి కుమార్, గడివేముల తహసిల్దార్ , టిడిపి పార్టీ తరఫున ప్రశాంత్ రెడ్డి, వైయస్సార్ సిపి పార్టీ తరఫున సురేష్ ,సిపిఎం పార్టీ తరఫున రామకృష్ణ, బిఎస్పి పార్టీ తరఫున చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో హిందీ పరీక్షకు 1306 గైర్హాజరు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 19- నంద్యాల జిల్లా నందు హిందీ పరీక్ష ప్రశాంతంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్యపరీక్షలు సజావుగా జరిగినట్లు డీఈ ఓ సుధాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు . నంద్యాల జిల్లాలో 134 పరీక్షా కేంద్రాలలో 25209 విద్యార్థులకు గాను23903 విద్యార్థులు (95 శాతం ) పరీక్షకు హాజరుకావటం జరిగిందన్నారు. 1306 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు తెలిపారు. మంగళవారం బలపనూరు జిల్లా పరిషత్ పాఠశాల లో మంగళవారం నాడు జిల్లా కలెక్టరు డా. కే. శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి. జిల్లా విద్యాశాధికారి 2 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు జిల్లా వ్యాప్తంగా 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌టీంలు 38 పరీక్షాకేంద్రాలను తనిఖీలు చేశారని అన్నారు . అదేవిదంగా స్టేట్ అబ్జర్వర్ ఆర్ ఎస్ .గంగ భవాని 6 పరీక్ష కేంద్రాలను తనీఖీలు నిర్వహించారని మొత్తం 48 పరీక్షాకేంద్రాలను మంగళవారం తనిఖీలు చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మకకేంద్రాలలోసిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి సజావుగా పరీక్షలు నిర్వహించామని అన్నారు

# ప్రతి చిన్న సంఘటనను వీడియోగ్రఫీ తీయాలి

జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 19-ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, విఎస్టిటీమ్‌లవీడియోగ్రాఫర్లు నిష్పక్షపాతంగా, పార్టీలకతీతంగా ప్రతి చిన్న సంఘటనను వీడియోగ్రఫీ తీసి సంబంధిత టీమ్ ల అధికారులకు ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికివ్యతిరేకంగాఉన్న ప్రతి అంశాన్ని చిత్రీకరించాలన్నారు. అలాగే అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, సమావేశానికి హాజరైన ప్రజలు, సమావేశానికి అయ్యే ఖర్చు, ఓటర్లకు పంపిణీ చేసే వస్తువులు, వినియోగించిన వాహనాలు తదితరాలన్నింటినీ వీడియోగ్రఫీ చేయాలన్నారు. ఎన్నికల సజావు నిర్వహణకు నిష్పక్షపాత వీడియోగ్రఫీ కీలకమన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రతి ఒక్కరికి షాడో టీం ఏర్పాటు చేస్తామని... ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించి సాక్షాదారులతో వీడియోగ్రఫీ ఉంటే రిపోర్ట్స్ ఆధారంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈసీఐ కు పంపుతామన్నారు. వీడియో గ్రాఫర్లు షిఫ్ట్ ల ప్రకారం సంబంధిత టీమ్ ల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు



ఈ సమావేశంలో ఎస్ డి సి కామేశ్వరరావు వీడియోగ్రఫీ తీయాల్సిన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించారు. డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మైనింగ్ శాఖ ఏడి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సమన్వయ కమిటీ చైర్మన్ గా అనంత రత్నం

విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి మార్చి 19-కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ గా అనంతరత్నం గారిని నియమించడమైనది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు గారి సూచన మేరకు అఖిల ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి గారి ఆదేశాల మేరకు అనంతరత్నం గారిని జిల్లా కాంగ్రెస్ సమన్వయ కమిటీ చైర్మన్ గా నియమించి రత్నం కు నియామక పత్రమును అందించి ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని డిసిసి అధ్యక్షులు కె బాబురావు గారు తెలియజేశారు. అనంత రత్నం గారు మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు ప్రియతమ జాతీయ కాంగ్రెస్ నాయకులు శ్రీ రాహుల్ గాంధీ గారికి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే గారికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి వైఎస్ షర్మిలమ్మ గారికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు గారికి కృతజ్ఞతలు



తెలియజేస్తున్నానని ఈ ఎన్నికల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరినీ నియోజకవర్గాల వారిగా సమన్వయపరిచి అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు తెలిపే విధంగా అందరినీ సమన్వయ పరిచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుటకు నా వంతు కృషి చేస్తానని అనంతరత్నం గారు హామీ ఇచ్చారు

# శ్రీశైలం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం అసెంబ్లీ టిడిపి... అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి

శ్రీశైలం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి తో పాటు శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శివరామిరెడ్డి, కంచర్ల గోవింద రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కలిముల్లా, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బిజెం వెంకట సుబ్బా రెడ్డి, జన సేన జిల్లా నాయకుడు శ్రీరాములు, శ్రీశైలం మండల నాయకులు శ్రీనివాస రెడ్డి, రమణ,ఉమామహేశ్వరరావు, సుబ్బా రాయుడు,ఆత్మకూరుమండల అధ్యక్షు డుశివప్రసాద్ రెడ్డి, రాజారెడ్డి, మల్లికా ర్జున రెడ్డి, గోకారి, పుల్లారెడ్డి, దినకర్, పట్టణఅధ్యక్షుడువేణుగోపాల్, అబ్దుల్లా పురం బాషా, కొప్పరపు రవి ప్రసాద్, నాఘుర్, వెలుగోడు మండల అధ్యక్షు లు అన్నారపు శేష రెడ్డి, రజాక్, హిదాయత్,రసూల్,బండి ఆత్మకూరు మ ం డలనాయకులుసురేష్ రెడ్డి, మనోహర్ చౌదరి, పాల సుబ్బా రెడ్డి, భరద్వాజ శర్మ, మహానంది మండల అధ్యక్షులు ఉల్లి మధు, జనార్ధన్, మౌళీశ్వర రెడ్డి, క్రాంతి కుమార్, అస్లాం బాషా తదితరులు పాల్గొన్నారు.



## పట్టణంలో పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకి రావ డంతో నంద్యాల పట్టణంలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలు, పలు ప్రధాన రోడ్లు, కాలనీల్లో ఉన్న వివిధ రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, పార్టీల జెండాల తొలగింపుతో పాటు విగ్రహాలకు, శిలాఫలకాలకు ముసుగులు వేశారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి దగ్గర ఉండి సిబ్బంది తో ఎన్నికల కోడ్ అమలులో నిమగ్నమయ్యారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**